మహబూబ్‌నగర్



వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


## కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామి జయంతి

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 05 ప్రభాతవార్త :** కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించిన గడ్డం వెంకటస్వామి జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మోహన్‌రావులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సుదీర్ఘకాలం పాటు కేంద్ర మంత్రిగా, పార్లమెంట్ సభ్యునిగా ప్రాతినిధ్యం వహించిన గడ్డం వెంకటస్వామి దళిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కోసం విశేష కృషి చేశారని అన్నారు. అంబేద్కర్ కళాశాల స్థాపించి విద్యారంగంలో కూడా డొనేషన్‌లు లేకుండా పేద వర్గాల విద్యార్థులకు విద్యనందించారని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మోహన్‌రావు, జిల్లా యువజన, క్రీడల అధికారి శ్రీనివాస్, డిఆర్‌డిఓ నర్సింహులు, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేష్, మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారిణి జరీనా, బిసి సంక్షేమ శాఖ అధికారిణి ఇందిర, డిపిఆర్ఓ శ్రీనివాస్, చేనేత జౌళిశాఖ అధికారి బాబు, కలెక్టరేట్ ఏఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

### జోగులాంబ గద్వాల జిల్లాలో..

**గద్వాల, అక్టోబర్ 5 ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించి, కార్మికుల హక్కుల కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడు గడ్డం వెంకటస్వామి అని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు. శనివారం ఐడిఓసి ఆవరణలో కలెక్టరేట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమర యోధుడు కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర తొలి , మలిశ ఉద్యమాల్లో ఎంతో ముఖ్యపాత్ర పోషించారని, కార్మికుల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమని అన్నారు. సింగరేణి కార్మికుల హక్కులు కాపాడేందుకు, వారి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన సంకల్పం, పట్టుదల, ప్రజల పట్ల ఆయనకున్న అనురాగం అందరికి ఆదర్శ ప్రాయమైనది. నేటి తరాలకు ఆయన జీవితం స్ఫూర్తిగా నిలుస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వి.లక్ష్మి నారాయణ, ఏఓ వీరభద్రప్ప, జెడ్పీసీఈఓ కాంతమ్మ, ఇంచార్జి బీసీ సంక్షేమ శాఖ అధికారి రమేశ్‌బాబు, ఎస్‌సి సంక్షేమ శాఖ అధికారి సరోజమ్మ, జిల్లా అధికారులు, కలెక్టర్ కార్యాలయం సిబ్బంది, తదితరులు ఉన్నారు.



కేంద్ర మాజీ మంత్రి జి.వెంకట్‌స్వామి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ సంతోష్

## నేడు అలంపూర్‌కు భారీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు రాక



**ఇటిక్యాల, అక్టోబరు 05 ప్రభాతవార్త :** ఐటి, భారీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అలంపూర్ జోగులాంబ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని వారి వెంట ఏఐసిసి కార్యదర్శి ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ ఇంఛార్జి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ హాజరు కానున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. దేవీ శరన్నవరాత్రుల బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం 8 గం.లకు జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. మంత్రి రాక సందర్భంగా నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## కురుమూర్తి బ్రహ్మోత్సవాలు..



- ఈనెల 18 నుండి నవంబర్ 18 వరకు జాతర
- నవంబర్ 2న కళ్యాణం,
- 6న అలంకారోత్సవం, 8న ఉద్దాలు
- ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు రానీయొద్దు
- పకడ్బందీ ఏర్పాట్లు నిర్వహించాలి
- బ్రహ్మోత్సవాలపై మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్రబోయి సమీక్ష
- హాజరైన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 05 ప్రభాతవార్త :** అక్టోబర్ 31 నుండి 18 వరకు నిర్వహించనున్న శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ సమీపంలో వెలసిన శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల విషయమై శనివారం జిల్లా కలెక్టర్ దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డితో కలిసి సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయం సమావేశ మందిరంలో జిల్లాస్థాయి కో ఆర్డినేషన్ కమిటి సమావేశం నిర్వహించారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం సైతం బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం వివిధ శాఖల అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని అందుకనుగుణంగా తగు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 31న ప్రారంభమవుతాయని బ్రహ్మోత్సవాలలో భాగంగా నవంబర్ 2న స్వామివారి కళ్యాణోత్సవం, నవంబర్ 6న అమ్మాపురం గ్రామం నందు శ్రీ కురుమూర్తి స్వామివారి స్వర్ణ ఆభరణాలకు పూజా కార్యక్రమం, స్వామి వారికి స్వర్ణాభరణాలతో అలంకారోత్సవం, నవంబర్ 8న ఉద్దాల ఉత్సవం ఉంటాయని కలెక్టర్ తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు వివిధ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. తాగునీరు, పారిశుద్ధ్య కమిటి, ఆహార కమిటీ, ఫెస్టివల్ కమిటీ, లా అండ్ ఆర్డర్ కమిటి వంటి ముఖ్యమైన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

**జాతర ఏర్పాట్ల వసతులపై...**

ఉత్సవాలకు వచ్చే భక్తులకోసం తాగునీరు, పారిశుద్ధ్యం, టాయిలెట్లు, బందోబస్తు, రవాణా సౌకర్యాలు, వాహనాల పార్కింగ్ ఏర్పాటుకు ఆయాశాఖల అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. బందోబస్తులో భాగంగా జాతర నిర్వహించే ప్రదేశంలో ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, జిల్లా వైద్యారోగ్యశాఖ తరపున ప్రథమచికిత్సతోపాటు, అవసరమైన అంబులెన్స్ ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్‌అండ్‌బి ద్వారా బారికేడింగ్‌తో పాటు, రహదారులకు ప్యాచ్ వర్కులు, రిపేర్ చేయించాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ రోడ్ల గుంతలు పూడ్చాలని, రిపేర్‌లు రోడ్ల వెంబడి జంగిల్ కటింగ్ చేయాలని, మిషన్ భగీరథ శాఖ ద్వారా తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మించాలని, షవర్లు పెట్టాలని, భక్తులకు అసౌకర్యం – మిగతా4లో..

## చెరువు నాలాను పూడ్చి దిశను కూడా మార్చారు..

- సర్వే నంబర్ 118/పిలో తప్పులు జరిగాయి
- నలుగురు అధికారుల కమిటీ అదే తేల్చింది
- వారాహి వెంచర్‌కు అక్రమ అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలి
- జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి



సర్వే నంబర్ 118ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే (ఫైల్)

**బాలానగర్, అక్టోబరు 05 ప్రభాతవార్త :** సర్వే నం 118/పిలో అక్రమాలు నిజమేనని, 1.67 లక్షల టన్నుల మట్టిని అక్రమంగా తెచ్చిపోశారని, చెరువు నాలాను పూడ్చి దిశను కూడా మార్చేశారని జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఈ మేరకు పత్రికా ప్రకటనలో వివరిస్తూ, ప్రభుత్వ స్మశానాన్ని ధ్వంసం చేశారని, ఈ విషయాన్ని నలుగురు అధికారుల కమిటీ నివేదిక వెల్లడి చేసిందని అన్నారు. అక్రమ అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఓన్‌ఓసి రద్దు చేయాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని సర్వే నంబర్ 118/పిలో అక్రమాలు జరిగిన మాట వాస్తవమేనని, ఆ భూమిలో ఉన్న చెరువు కాల్వను పూడ్చివేసి దాన్ని దారి మళ్లించడం, ఆ ప్రాంతంలో ఉన్న స్మశానాన్ని ధ్వంసం చేయడం నిజమేనని ఈ విషయంగా విచారణ చేసిన నలుగురు అధికారుల కమిటి తేల్చిందని పేర్కొన్నారు. బాలానగర్‌లోని సర్వే నంబర్ 118/పి లో ఉన్న భూమిలో శ్రీ వారాహి ఇన్‌ఫ్రా అండ్ డెవలపర్స్ సంస్థ భారీ ఎత్తున మట్టిని బయటి ప్రాంతాల నుంచి తరలించి అక్కడున్న చెరువు కాల్వను పూడ్చి వేయడంతో పాటుగా, స్మశానాన్ని కూడా ధ్వంసం చేసిందంటూ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చేసిన ఫిర్యాదుపై స్పందించిన జిల్లా కలెక్టర్ నలుగురు అధికారులతో ఒక విచారణ (ఫోర్‌మెన్) కమిటీని నియమించింది. ఈ కమిటీలో మహబూబ్‌నగర్ ఆర్డీఓ ఇ. నవీన్, ఇరిగేషన్ ఇఇ సిహెచ్ ఉదయ్‌శంకర్, సర్వే లాండ్ రికార్డ్సు ఏడి ఎస్. కృష్ణారావు, డిడిమైన్స్ కె. నరసింహారెడ్డి తదితర అధికారులు ఉన్నారు. ఈ నలుగురు అధికారుల కమిటీ ఈ వ్యవహారాన్ని నిగ్గు తేల్చడానికి మండల అధికారులతో కలిసి గత మే నెలలో బాలానగర్ సర్వే నంబర్ 118/పి ని సందర్శించి అక్కడి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించింది. అలాగే ఈ సర్వే నంబర్‌కు ఆనుకుని ఉన్న ఇతర సర్వే నంబర్లకు చెందిన రైతులు, గ్రామస్తులను కూడా విచారించి వారి వాంగ్మూలాలను కూడా సేకరించింది. అధికారుల కమిటీ తన పరిశీలనలో తేలిన విషయాలను బట్టి అనిరుధ్‌రెడ్డి సర్వే నంబర్ 118/పి గురించి చేసిన ఆరోపణలు వాస్తవమేనని తేల్చింది. ఇటీవలే ఈ నలుగురు అధికారుల కమిటీ తన విచారణ నివేదికను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయికి సమర్పించిందని ఈ సందర్భంగా అనిరుధ్‌రెడ్డి తెలిపారు. ఈ కమిటీ సమర్పించిన విచారణ నివేదిక ప్రకారంగా సర్వే నంబర్ 118/పిలో బయటి ప్రాంతాల నుంచి భారీ ఎత్తున మట్టిని తీసుకొచ్చి పోశారని స్పష్టమైందని చెప్పారు. ఏకంగా 1 లక్ష 67 వేల 396 మెట్రిక్ టన్నుల మట్టిని అక్రమంగా బయటి ప్రాంతాల నుంచి అక్కడికి తీసుకొచ్చి పోశారని అధికారుల నివేదికలో తేల్చారని చెప్పారు. అలాగే అక్కడున్న ఇతర పట్టాదారులను అధికారుల కమిటి విచారించినప్పుడు బాలానగర్ పెద్ద చెరువు వెళ్లే కాలువను మట్టితో పూడ్చివేసి దాని దిశను మార్చేశారని దీని ఫలితంగా నాలాలో ప్రవాహానికి అంతరాయం ఏర్పడి చుట్టుపక్కల ఉన్న పొలాలను జలమయం చేస్తూ పంటలను నాశనం చేసి రైతులకు నష్టం కలిగిస్తోందని అధికారుల విచారణలో తేలిందని తెలిపారు. అలాగే 2.20 ఎకరాల విస్తీర్ణంలో అక్కడ ఒక స్మశానం ఉండగా దాన్ని కూడా వారాహి సంస్థ ధ్వంసం చేసిందని అధికారుల కమిటి విచారణ నివేదికలో తేలిందన్నారు. వారాహి సంస్థ గురించి తాను గతంలో చేసిన ఆరోపణలన్ని వాస్తవాలని ఈ నలుగురు అధికారుల కమిటి తేల్చిందని అనిరుధ్‌రెడ్డి వివరించారు.

**అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలి:**

అయితే ఈ వ్యవహారంలో తప్పు చేసిన అధికారులు అందరిపై కూడా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అనిరుధ్‌రెడ్డి డిమాండ్ చేశారు. సర్వే నంబర్ 118/పి మధ్యలో కాలువ పోతుందనే విషయం తెలిసి కూడా ముడా అధికారులు దీనికి పర్మిషన్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఇరిగేషన్ అధికారుల నుంచి దీనికి ఎన్‌ఓసి ఎలా వచ్చిందని నిలదీశారు. ఈ భూమిలో అక్రమంగా మట్టి తెచ్చిపోశారని వారాహి సంస్థకు రూ. 5.12 కోట్ల జరిమానాను అధికారులు విధించగా, గతంలో ఇక్కడున్న ఏడి మైన్స్ తాను ఇక్కడి నుంచి జనగామకు బదిలీ కావడానికి ఒక్కరోజు ముందు అక్కడ ఉన్న మట్టిని అక్కడే తవ్వి పోశారని, అందుకే ఈ జరిమానాను వారాహి సంస్థ చెల్లించాల్సిన అవసరం లేదంటూ ఉత్తర్వులు ఇచ్చి వెళ్లిపోయారని గుర్తు చేశారు. ప్రస్తుతం అక్కడున్న మట్టి మొత్తం బయటి నుంచి అక్రమంగా తెచ్చి పోశారనే విషయాన్ని ఫోర్‌మెన్ కమిటీ నిర్ధారించిన నేపథ్యంలో అప్పటి ఏడీ మైన్స్‌పై కూడా చర్యలు తీసుకోవాలని అనిరుధ్‌రెడ్డి డిమాండ్ చేశారు. సర్వే నంబర్ 118/పి లో ఉన్న భూమి అసైన్డ్ భూమి అని దీనికి అధికారులు ఎన్‌ఓసి ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఈ అధికారులపై తాను చీఫ్ సెక్రెటరీకి కూడా ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. సర్వే నంబర్ 118/పి భూమికి ఇచ్చిన ఎన్‌ఓసిని రద్దు చేయాలని, అక్కడ పూడ్చి వేసి కాల్వను తిరిగి అక్కడే తవ్వించాలని, ధ్వంసం చేసిన స్మశాన భూమిని పరిరక్షించాలని కూడా అనిరుధ్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## మైనింగ్ మాఫియా..!

- కేసులు వద్దు తూతు
- మంత్రంగా జరిమానా
- ఎంతైనా తవ్వుకోండి..
- మాకు వస్తే చాలు
- ముడుపులు చెల్లిస్తే
- చాలు... ఎంతైనా తవ్వండి



టిప్పర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్న మట్టిని అడ్డుకున్న ట్రాక్టర్ల యజమానులు

**వనపర్తి ప్రతినిధి అక్టోబర్ 05 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లాలో మైనింగ్ అధికారుల తీరు పలువురిని ఆశ్చర్యాన్ని కలగజేస్తుంది. జిల్లాలో పలుచోట్ల గుట్టలను అక్రమంగా తవ్వుతూ మట్టిని తరలిస్తున్నా ఒకచోట కూడా కేసు నమోదుకాకపోవడం విస్మయానికి గురిచేస్తుంది. జిల్లాలో ప్రతిరోజు ప్రతి మండలంలో ఏదో ఒకచోట అక్రమార్కులు మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్న మైనింగ్ అధికారులు నామమాత్రపు తనిఖీల పేరుతో హడావిడి చేస్తూ పబ్బం గుడుపుతున్నారు. సిబ్బంది జిల్లా నలుమూలల పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పన్నారు. తప్ప ఒక్కచోట కూడా అక్రమంగా మట్టిని తరలిస్తున్నా ఏ ఒక్క వాహనంపై కూడా కేసు నమోదు కాకపోడం ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. జిల్లాలో కొన్ని చోట్ల కొంత మోతాదులో కొన్ని రోజులకు అనుమతులు తీసుకొని ప్రతిరోజు ఇష్టారీతిని అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. అనుమతులను పొందిన క్వారీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ప్రజలు అక్రమార్కుల మట్టి తరలింపు విషయాన్ని అధికారులకు మొరపెట్టుకున్నా వాటిపై చర్యలు తీసుకోకుండా లంచాలకు కక్కుర్తి పడుతున్నారని విమర్శిస్తున్నారు. ప్రజలను మభ్య పెట్టేందుకు నామమాత్రపు జరిమానాలతో అక్రమార్కులకు వత్తాసు పలుకుతూ అక్రమార్కుల ఆగడాలకు పునాదులు వేస్తున్నారు. ప్రతిరోజు లక్షల్లో సొమ్ము చేసుకుంటున్న మట్టి మాఫియా అక్రమాలకు నువ్వు మాత్రంగా ఒకటి లేదా రెండు వేలు జరిమానా విధిస్తూ ప్రభుత్వానికి గండి పెడుతున్నారు. శనివారం వనపర్తి జిల్లా అప్పయ్యపల్లి శివారులో అనుమతులు తీసుకుని మైనింగ్ చేస్తున్న ఒక వాహనం తాత్కాలిక బిల్లు లేకుండా మట్టి తరలిస్తున్నారని మైనింగ్ అధికారులు వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్‌కి తీసుకువచ్చారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చాక మైనింగ్ అనుమతి పొందిన వ్యక్తి అప్పటికప్పుడు బిల్లు జనరేట్ చేసి ప్రజలను అధికారులను మభ్య పెట్టారు. నియమా నిబంధనలు తెలిసిన అధికారులు కూడా అక్రమార్కులకు వంత పాడుతూ అక్రమంగా మట్టి తరలిస్తున్న వ్యక్తులపై వాహనాలపై కేసు నమోదు చేయకుండా కేవలం 2600 రూపాయల జరిమానా విధించి వాహనాన్ని వదిలిపెట్టారు. ఒక్క బిల్లు జనరేట్ చేసి రోజు దాదాపు 5నుంచి 6ట్రిప్పుల మట్టిని తరలిస్తున్న వాహనానికి కేవలం 2600 రూపాయలు జరిమానా విధించడంతో ప్రజలు ముక్కున వేలు వేసుకున్నారు. ఆ మైనింగ్‌కి అనుమతి తీసుకున్న వ్యక్తి ఇదివరకే పలుమార్లు అధికారులను మభ్యపెట్టినట్టు పలువురు ఆరోపించారు. దొరికితే దొంగ లేదంటే దొర అన్న చందంగా ఆ వ్యక్తి ప్రవర్తిస్తూ అధికారులు పట్టుకున్నప్పుడు మాత్రమే బిల్లులు జనరేట్ చేసి అధికారులకు ముడుపులు అప్పజెప్పున్నట్లు పలువురు ఆరోపించారు. ఉన్నత అధికారులు స్పందించి జిల్లాలో జరుగుతున్న మైనింగ్ పై విచారణ చేపట్టి ప్రకృతిని కాపాడాలని కోరుతున్నారు. జిల్లాలో ఇప్పటికే పలుచోట్ల గుట్టలన్ని అక్రమార్కుల చేతులలో మాయమమయ్యాయి అని అవినీతికి పాల్పడే అధికారులను తొలగించి నిజాయితీపరులైన అధికారులకు స్థానం కల్పించి వనపర్తి జిల్లాలో గుట్టలను కాపాడాలని పలువురు ఆశిస్తున్నారు.

**తవ్వకాలకు పర్మిషన్లు తప్పనిసరి..**

జిల్లా మైనింగ్ అధికారి గోవిందరాజులను వివరణ కోరగా బిల్లులు లేకుండా మట్టిని తరలిస్తున్న వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చామని చెప్పారు. చివరాకరకు మైనింగ్ అనుమతి పొందిన వ్యక్తి బిల్లు జనరేట్ చేసి ఇచ్చాడని తెలిపారు. బిల్లు కట్టినందువల్ల కేసు పెట్టకుండా 2600 జరిమానా విధిస్తూ వదిలిపెట్టమని తెలిపారు. అంతకుమించి ఏమీ చేయలేము అంటూ వివరణ ఇచ్చారు.

## 24మంది అభ్యర్థుల గైర్హాజరు..

**- ముగిసిన డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన**

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 5, ప్రభాతవార్త:** డీఎస్సీ -2024 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శనివారంతో ముగిసినట్లు డీఈవో రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 576 మంది అభ్యర్థులకుగానూ 552 మంది అభ్యర్థులు హాజరుకాగా 24మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలనుసారం 1:3 నిష్పత్తి ప్రాతిపదికన ఎంపిక కాబడిన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు పరిశీలించినట్లు వెల్లడించారు. 1:1 నిష్పత్తి ప్రకారం ఎంపిక ప్రక్రియ పూర్తికాగానే ఈనెల 9న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జాయినింగ్ లెటర్లు అందజేయనున్నట్లు ఇటీవల ఫలితాల విడుదల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో అభ్యర్థులు సంతోషంలో ఉన్నారు.

## మండలంలో జోరుగా బియ్యం దందా..!

**ఉప్పునుంతల, అక్టోబరు 05 ప్రభాతవార్త :** మండలంలోని శ్రీశైలం, హైదరాబాద్ ప్రధాన రహదారిలోని తూర్పు గ్రామాలలో రేషన్‌బియ్యం దందా జోరుగా కొనసాగుతుంది. జిల్లా ఉన్నత అధికారుల అండ దండలతో వ్యాపారం, ఆ వ్యాపారికి అడ్డు అదుపు లేకుండా పోయింది. పెనిమిళ్ళ, గువ్వలోనిపల్లి గ్రామాలలో పిడిఎస్ బియ్యం స్టాక్ పెట్టుకొని రాత్రివేళల్లో కల్వకుర్తి, దేవరకొండ లాంటి ఉన్న రైస్ మిల్లులకు తరలిస్తున్నట్లు సమాచారం. సివిల్ సప్లై అధికారుల సహకారంతో ఈ వ్యాపారం కొనసాగుతున్నట్లు తెలుస్తుంది. సివిల్ సప్లై అధికారులు మండలంలో నిఘా పెట్టకపోవడం వ్యాపారులకు మూడు పూలు, ఆరు కాయలుగా మారింది. ముఖ్యంగా మండలంలోని తూర్పు గ్రామాలలో పిడిఎస్ రైస్ వచ్చిన వెను వెంటనే వ్యాపారికి తీరిక లేకుండా బియ్యం కొనుగోలు చేస్తుంటాడు. అధికారులు, ప్రజాప్రతినిధులు తమకు పూర్తి సహకారం ఉందని వివరిస్తూ ప్రజల నుంచి భారీ ఎత్తున పిడిఎస్ రైస్‌ను సేకరిస్తున్నట్లు తెలిపింది. ఇప్పటికైనా జిల్లా సివిల్ సప్లై అధికారులు మండలంలో తూర్పు గ్రామాలపై ప్రత్యేకంగా నిఘా పెట్టి దాడులు చేస్తే భారీగా పిడిఎస్ రైస్ పట్టుబడే అవకాశం ఉంది.

**పిడిఎస్ రైస్‌తో పాటు నల్లబెల్లం వ్యాపారం జోరు...**

ఆయా గ్రామాలలో పిడిఎస్ రైస్‌తో పాటు నల్లబెల్లం వ్యాపారం భారీ ఎత్తున కొనసాగుతుంది. అన్ని రకాల అండదండలు ఉన్నాయని, భారీ ఎత్తున బియ్యం దందా, నల్లబెల్లం వ్యాపారం కొనసాగుతుంది. సివిల్ సప్లై అధికారులు, తెల్కపల్లి ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని దాడులు నిర్వహించి అక్రమ వ్యాపారానికి కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## భగీరథ నీరే సురక్షితమైనది..

- మంచినీటి సహాయకులు
- ప్రజలకు అవగాహన కల్పించాలి
- శిక్షణ ముగింపు సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే తూడిమేఘారెడ్డి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి అక్టోబర్ 05 ప్రభాతవార్త :** మిషన్ భగీరథ ద్వారా సరఫరా అయ్యే తాగునీరు ఎంతో ఆరోగ్యదయకమని మిషన్ భగీరథ నీరు తాగడం వలన మనందరం ఆరోగ్యంగా ఉంటామని వనపర్తి ఎమ్మెల్యే శ్రీ తూడి మేఘారెడ్డి పెర్కోన్నారు. శనివారం వనపర్తి మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామ మంచినీటి సహాయకుల నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమంలో చేతిపంపుల నిర్వహణ. బోరు మోటర్ల మరమ్మత్తులు, జాగ్రత్తలు, పైపులైన్ల పరిశుభ్రత అంశాలపై సహాయకులకు మిషన్ భగీరథ అధికారులు నాలుగు రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరిగిందని , ఇందులో మినరల్ వాటర్, బాటిల్, మన ఇంటిలోని, తాగునీరు, మిషన్ భగీరథ నీరు, బోరుబావినీరుకు ఉన్న వ్యత్యాసాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు పరిశోధనాత్మకంగా వివరించేందుకు ఈ శిక్షణ కార్యక్రమంలో చేపట్టినట్లు ఆయన తెలిపారు. గ్రామాలలో ప్రజలతో మమేకమై ఉండే చిన్న ఉద్యోగస్తులైన సహాయకులపైనే పని భారం ఎక్కువగా ఉంటుందని ఎక్కడ కూడా అసహనానికి గురవకుండా ప్రజల సమస్యల నివృత్తి చేస్తూ రక్షిత మంచినీటిని అందజేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా నాలుగు రోజుల శిక్షణతో పాల్గొన్న గ్రామం మంచినీటి సహాయకులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6గ్యారెంటీల హామీల అమలులో గల మహాలక్ష్మి పథకంలోని రాయితీ సిలిండర్లకు సంబంధించిన పత్రాలను మహిళలకు అందజేశారు. మహిళల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెడుతోందని అందులో భాగంగానే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం మహిళా సంఘాల సభ్యురాళ్లకే పాఠశాలల్లోని విద్యార్థులకు స్కూల్ డ్రెస్సులు తయారు చేయడం, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ని ఆర్టీసీ బస్సులు కొనుగోలు ,పావలా వడ్డీ రుణాలు లాంటి అనేక కార్యక్రమాలు చేపట్టిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు అందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని – మిగతా2లో..

## 7న జాబ్ మేళా...

## ఉపాధి కల్పనాధికారి ప్రియాంక



**గద్వాల, అక్టోబర్ 5 ప్రభాతవార్త:** జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించుటకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో పాల్గొనే నిరుద్యోగులు 18 నుండి 35 సంవత్సరంలోపు వయస్సుతో పాటు ఇంటర్, డిగ్రీ, అర్హత కలిగి ఉండాలని తెలిపారు. ఎంపికైన నిరుద్యోగులకు శిక్షణ అనంతరం కర్నూలు గద్వాల జిల్లాలలో గల వివిధ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఆమె తెలిపారు. వినూత్న ఫర్టిలైజర్స్ కంపెనీ నుండి 150 ఖాళీలు ఉన్నటుట్లు ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్‌మేళా ఈనెల 7వతేదిన ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు బీసీస్టడీ సర్కిల్ గద్వాల్ మొదటి రైల్వేగేట్ నందు నిర్వహించనున్నట్లు ఇతర వివరములకు సెల్ నెంబర్ 8309921730 కు సంప్రదించాలని తెలిపారు.

## శ్రీ అన్నపూర్ణదేవి రూపంలో అమ్మవారు

**ఉప్పునుంతల, అక్టోబరు 05 ప్రభాతవార్త :** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన శనివారం దుర్గామాత అన్నపూర్ణదేవి రూపంలో దర్శనమిచ్చారు. ఆయా గ్రామాలలో దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని గంధం, పసుపు, వస్త్రాలతో, పూలమాలలతో అలంకరించి అమ్మవారికి ఇష్టమైన నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి మహా సంకల్పం, గణపతి పూజ, స్వస్తి పుణ్యవచనం, కుంకుమార్చన, హారతి, మంత్ర పుష్పం తదితర పూజాకార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని ఉప్పునుంతల, కంసానిపల్లి, బిసికాలనీ, లక్ష్మాపూర్, వెల్టూరు, పెనిమిళ్ల, తాడూరు, మామిళ్ళపల్లి, ఉప్పరపల్లి, మర్రిపల్లి గ్రామాల్లో వివిధ యువజన సంఘాల ఆధ్వర్యంలో దుర్గామాత వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల శ్రీ కేదారేశ్వర ఆలయంలో మాజీ సర్పంచ్ సరితానంతరెడ్డి దంపతులు దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు.



కంసాన్‌పల్లిలో దుర్గామాత వద్ద ప్రత్యేక పూజలు

## కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**కృష్ణ, అక్టోబరు 05 ప్రభాతవార్త :** తంగిడిగి గ్రామ యువ సేవా సంఘం ఆధ్వర్యంలో గ్రామంలోని వీరాంజనేస్వామి దేవస్థానం ఆవరణలో మీనాక్షి నేత్రాలయ ఆసుపత్రి యాదగిరి డా. ప్రదీప్ ఎస్. రెడ్డి వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో పేద ప్రజలు దృష్టి లోపం ఉన్న ప్రజలు ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఉదయం 9 గం.ల నుండి మధ్యాహ్నం 12 గం.ల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా జనరల్ వైద్య పరీక్షలను చేయబడుతుందని ఉచిత మందుల పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి తంగిడిగి గ్రామస్తులే కాక చుట్టు పక్కల గ్రామస్తులందరూ సదవకాశాన్ని వినియోగించుకోవాలని గ్రామ యువక మండలి కోరారు.

## కేంద్ర మాజీ మంత్రి

## వెంకటస్వామికి నివాళులర్పించిన అధికారులు

**ఇటిక్యాల, అక్టోబరు 05 ప్రభాతవార్త :** తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి సింగరేణి కార్మికుల హక్కుల కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడు గడ్డం వెంకటస్వామి కాకా జయంతిని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసిల్దార్ నరెందర్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో ఆర్ఐ భీమ్‌సేన్‌రావు, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.



కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న తహసీల్దార్ నరేందర్, సిబ్బంది

## ప్రభుత్వ కళాశాలలో బతుకమ్మ సంబరాలు...

**ఆత్మకూరు అక్టోబర్ 05 ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం రోజు బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. చిన్నా పెద్ద తేడా లేకుండా బతుకమ్మ పాటలు పాడుతూ సంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను కొనసాగించే కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ బతుకమ్మ సంబరాలలో పాల్గొని జయప్రదం చేయాలని కళాశాల ప్రిన్సిపల్ భాగ్య వర్ధన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో విద్యార్థిని విశ్వేశ్వర్, భాగ్య వర్ధన్‌రెడ్డి, కురుమూర్తి, వీణతో పాటుగా పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



ఆత్మకూరులోని ప్రభుత్వ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

## జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు పెంచాలి

### జిల్లా కలెక్టర్‌ను కలిసిన రంజిత్ కుమార్

**గద్వాల, అక్టోబర్ 5 ప్రభాతవార్త:** గట్టు, కేటీదొడ్డి మండలాలకు పూర్తి శాంక్షన్ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడమే కాకుండా విద్యార్థుల సంఖ్యను కాబట్టి పెంచాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ జి.రం జిత్ కుమార్ డి మాండు చేశారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబాటు తనానికి గురైనటువంటి జోగులాంబ గద్వాల జిల్లాకు విద్యారఉ్థల సంఖ్యను బట్టి ఉపాధ్యాయుల నియామకాలను పెంచాలని ఆయన డిమాండు చేశారు. అలాగే గట్టు కేటిదొడ్డి మండలాలకు మంజూరైన పూర్తి పోస్టులను కేటాయిస్తూనే, నియామకాలను పెంచాలన్నారు. శనివారం నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్ జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం సమర్పించారు. గద్వాల జిల్లా పాలకుల నిర్లక్ష్యం చేత అక్షరాస్యతలో వెనుకబాటు తనానికి గురై, దశాబ్దాలుగా ఈ ప్రాంతం విద్యకు నోచుకోబడలేదన్నారు. జిల్లాలోని గట్టు కేటిదొడ్డి మండలాలు ఆసియా ఖండంలోనే అత్యంత నిర్లక్ష్యానికి గురయ్యారని అన్నారు. ఉపాధ్యాయుల కొరత వల్ల సరైన విద్య అందక, ముఖ్యంగా పేద వర్గాల పిల్లలు మధ్యలోనే చదువు ఆపే పరిస్థితి ఉన్నదన్నారు. కాబట్టి వెంటనే జిల్లాలోని ఉపాధ్యాయ నియామకాలను పెంచాలన్నారు. గట్టు, కేటిదొడ్డి మండలాలలో చాలా గ్రామాలలో పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వల్ల డ్రాప్ అవుట్స్ పెరుగుతున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా శాంక్షన్ అయినా పోస్టులను పూర్తిగా నియమించాలన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల సంఖ్యను బట్టి మంజూరు నియామకాలను పెంచాలని అన్నారు. జిల్లాలో బాలకార్మికులు పెరుగుతున్నారని, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి జిల్లాకు విద్యకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ బుచ్చిబాబు, నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు శ్రీనివాస్ యాదవ్, ప్రేమ్‌రాజు, రంగస్వామి, వెంకట్ రాములు, రాముడు, మల్దకల్, అడవి ఆంజనేయులు, గోపాల్, మీసాల కిష్టన్న, బలిరాజు రమేశ్, లక్ష్మన్న, సుదర్శన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్ సంతోష్ కు వినతిపత్రం ఇస్తున్న రంజిత్‌కుమార్

## భగీరథ నీరే సురక్షితమైనది..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు అందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరూ చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు . కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ , మున్సిపల్ చైర్మన్ మహేష్, మాజీ ఎంపీపీ శంకర్ నాయక్ మండలాధ్యక్షుడు రవి, కిరణ్, ఈఈ మేఘారెడ్డి, డి ఈ హరీష్ ,ఎంపీడీఓ అధికారులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఊరూరా కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్రులు..

**భూత్పూర్, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** తెలంగాణ సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ. తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ అంటేనే పూల పండుగ. దసరా అంటేనే దేవీ శరన్నవరాత్రులు, బతుకమ్మ సంబురాలు వెరసి దసరా ఉత్సవ వేడుకలని చెప్పవచ్చు. ప్రతీ ఏటా ఆశ్వీయుజ మాసంలో వచ్చే బహుళ అమావాస్యే మహాలయ అమావస్యంటారు. ఈ అమావాస్య పితృతర్పణాలకు ప్రతీది దీన్నే తెలంగాణ భాషలో పెత్తరమాస లేదా పెద్దల పండుగని అంటారు.. మరుసటి రోజు బతుకమ్మతో పాటు దేవీ శరన్నవరాత్రుల ఆరంభమౌతాయి. తొమ్మిది రోజుల పాటు అటు బతుకమ్మ, ఇటు శరన్నవరాత్రులతో ఆలయాలు, గ్రామ చావిడీలు హోరెత్తుతాయనే చెప్పాలి. శరన్నవ రాత్రులలో అమ్మవారిని తొమ్మిది రూపాలలో కొలిచినట్లే బతుకమ్మను తొమ్మిది రోజుల పాటు అనునిత్యం తీరొక్క పువ్వులతో అందంగా అలంకరించి అమ్మలక్కలందరూ ఆటపాటలతో అలరిస్తారు. పదో రోజు బతుకమ్మలను సమీపంలోని తటాకాలు, కొలనులు, కుంటలు, చెర్వులలో నిమజ్జనం చేస్తారు. తొలిరోజు బతుకమ్మను ఎంగిలిపూల బతుకమ్మగా, రెండో రోజు అటుకుల బతుకమ్మగా, మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మగా, నాల్గొ రోజు నాన బియ్యం బతుకమ్మగా. ఐదో రోజు అట్ల బతుకమ్మగా, ఆరో రోజు అలిగిన బతుకమ్మగా, ఏడో రోజు వేపకాయల బతుకమ్మగా, ఎనిమిదో రోజు వెన్నముద్దల బతుకమ్మగా, తొమ్మిదవ రోజు సద్దుల బతుకమ్మగా తొమ్మిది రోజుల పాటు కొలుస్తారు. తొమ్మిది రోజుల అనంతరం బతుకమ్మలను నీటిలో వదిలి నిమజ్జనం చేస్తారు. ఇలా దసరా పండుగ అంటేనే దేవీశరన్నవ రాత్రులు, బతుకమ్మ సంబురాలతో దసరా పండుగ ఉత్సవాలు ముగుస్తాయని చెప్పవచ్చు.



అమిస్తాపూర్‌లోని జ్ఞాన సరస్వతీ ఆలయంలో కొలువుధీరిన బాలా త్రిపుర సుందరీదేవి అమ్మవారు



భూత్పూర్‌లోని అంజనేయస్వామి ఆలయంలో కొలువుధీరిన దుర్గాదేవి అమ్మవారు



శాకంబరీ దేవి అలంకరణలో కన్యకా పరమేశ్వరి దేవి

**శాకంబరీ దేవిగా అమ్మవారు...**

**ఆత్మకూరు అక్టోబర్ 05 ప్రభాతవార్త :** శరన్న వరాత్రులలో భాగంగా శనివారం రోజు మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఘనంగా జరుపుకుంటున్నారు. అంతేకాకుండా పట్టణంలోని నీలకంఠేశ్వర స్వామి దేవాలయం, బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాలయం వాల్మీకి నగర్ తదితర కాలనీలలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహిస్తున్నారు. రాత్రివేళలో ప్రసాదం మిత్రమా పాటుగా అన్నదాన కార్యక్రమాలు బతుకమ్మ పాటలతో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను కొనసాగిస్తూ శరన్నవరాత్రుల వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నారు.

## గ్రామ అభివృద్ధిపై కాంగ్రెస్ నాయకుడు సోమనాద్రి దృష్టి

### రూ. 10 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణాలకు భూమిపూజ

**ఇటిక్యాల, అక్టోబరు 05 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొండేరు గ్రామ అభివృద్ధిపై కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడు పోతురాజు సోమనాద్రి దృష్టి సారించారు. ఏఐసిసి కార్యదర్శి ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ ఇంఛార్జి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో స్పెషల్ డెవలప్‌మెంట్ నిధుల కింద అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ నిధులు మంజూరు చేయించగా ఆ నిధులతో గ్రామ ప్రజలకు పలు కాలనీలలో సిసి రోడ్ల నిర్మాణాలను చేపట్టేందుకు నిర్ణయించారు. అందులో భాగంగా మసీదు ప్రాంతం నుండి చెరువు కట్ట దగ్గర సిసి రోడ్డు నిర్మాణ పనులను ఆయన భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ముఖ్య నాయకుడు పోతురాజు సోమనాద్రి మాట్లాడుతూ తాను విదేశాలలో స్థిరపడిన గ్రామాభివృద్ధి కోసం గ్రామ ప్రజలకు సేవ చేసేందుకు తాను నిత్యం ప్రజల మధ్యలో ఉంటానని గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని గ్రామంలో ప్రజల కోసం చేపట్టాల్సిన పనులను ఏఐసిసి కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ సహకారంతో నిధులను మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని గ్రామాభివృద్ధి కోసం చేపట్టాల్సిన పనులపై దృష్టి పెడతానన్నారు. సిసి రోడ్ల నిర్మాణ పనులను పంచాయతీరాజ్ ఏఈ పాండురంగారావు పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు సిరాజ్, బీచుపల్లి, రాముడు, అయ్యన్న, హనుమంతు, తిమ్మప్పగౌడు, లక్ష్మన్న, జాకీర్ భాష తదితరులు పాల్గొన్నారు.



సిసి రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

## పిఎం కిసాన్ యోజనకు అర్హత గల రైతులు దరఖాస్తు చేసుకోవాలి

### జిల్లా వ్యవసాయ అధికారి సక్రియా నాయక్

**ఇటిక్యాల, అక్టోబరు 05 ప్రభాతవార్త :** జిల్లాలో అర్హత గల రైతులు పీఎం కిసాన్ సమ్మాన్ పథకానికి అర్హత గల రైతులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్ సూచించారు. భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకం 18వ విడత నిధులను శనివారం భారత ప్రధాని నరేంద్రమోడీ వర్చువల్ పద్ధతిలో మహారాష్ట్ర నుండి దేశంలోని అన్ని రాష్ట్రాలలోని రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ యోజన కింద నమోదయి ఉన్న రైతుల ఖాతాలో 18వ విడత నగదు బదిలీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద నమోదైన రైతుల అకౌంట్‌లో నగదును బదిలీ చేస్తున్న జోగులాంబ గద్వాల జిల్లా వ్యవసాయ అధికారి ఎ.సక్రియానాయక్ శనివారం మండల పరిధిలోని తిమ్మాపూర్ రైతు వేదికలో వర్చువల్ పద్ధతిలో నగదు బదిలీ కార్యక్రమానికి హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా జిల్లాలో ఎవరైనా పిఎం కిసాన్ స్కీంలో నమోదు కాని రైతులు ఉంటే వెంటనే నమోదు చేసుకోవాలని కెవైసి, ఆధార్ నంబర్‌లను అకౌంట్‌కు అనుసంధానం చేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఈఓ నరేష్, రైతులు లోకారెడ్డి, సుధాకర్‌రెడ్డి, లోకారెడ్డి, భీమేష్‌నాయుడు, సహదేవుడు, రామాంజనేయులు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



రైతు వేదికలో రైతులకు సూచనలు చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్

## కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజలు తిప్పి కొట్టాలి : ఎండి జబ్బార్

**అమరచింత అక్టోబర్ 05 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పి కొట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి, ఎండి జబ్బార్ అన్నారు. శనివారం అమరచింత మండల కేంద్రంలోని జిఎస్ భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గిన కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌ధరలు తగ్గించకపోవడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆయిల్ కంపెనీల యజమానులతో కుమ్మకై వేలకోట్లు కేంద్ర ప్రభుత్వం దండుకుంటుందని ఆయన అన్నారు. అలాగే దేశంలో నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని పేదలకు కనీసం నిత్యవసరాలతో కాలం గడపడానికి ఇబ్బంది పడుతున్నారని ఆయన అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పెంచిన నిత్యవసర సరుకుల ధరలను వెంటనే తగ్గించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని వాగ్దానం చేసిన ఉద్యోగాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని దేశంలో నిరుద్యోగం పేదరికం పెరిగిపోతున్న కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పడం శోచనీయమని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం పార్టీ ఈ నెల 15నుండి 20వ తేదీ వరకు ఆందోళన చేస్తామని ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన ప్రజలను కోరారు. సిపిఎం వనపర్తి జిల్లా మూడవ మహాసభలు నవంబర్ 9,10 తేదీలలో విపనగండ్ల మండలంలో నిర్వహిస్తున్నామని జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి, జిఎస్ గోపి, బి వెంకటేష్, ఆర్ ఎన్ రమేష్ ,ఎస్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.



అమరచింత జిఎస్ భవనంలో విలేకరుల సమస్యలు మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జబ్బర్

## గ్రంథాలయాల వసతులు కలిపించుటకు చర్యలు:చైర్మన్ రియాజ్

**గద్వాల, అక్టోబర్5 ప్రభాతవార్త:** సమాజంలో మార్పు తీసుకొచ్చేందుకు గ్రంథాలయాలు ఎంత దోహదం చేస్తాయని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్ పేర్కొన్నారు. శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ, గద్వాల పట్టణంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రియాజ్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా గ్రంథాలయం ఏ విధంగా అభివృద్ధి చెందిందో గద్వాల కేంద్ర గ్రంథాలయాన్ని కూడా ఈ విధంగా అన్ని వసతులతో సరిపోనుగా వివిధ పోటీ పరీక్షల పుస్తకములు, అన్ని వర్గాలకు అందుబాటులో ఉండేటట్లు నా యొక్క సహాయ, సహకారాలు అందిస్తానని చెప్పి పాఠకులతో చర్చించడం జరిగింది. ఉమ్మడి జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించి వెనుకబడిన జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అడుగులు పడేటట్టు కృషి చేస్తానన్నారు. గ్రంథాలయ భవనాలకు స్థలాలు ఉన్నట్లయితే నూతన భవన నిర్మాణాల కోసం కృషి చేస్తానని, భవిష్యత్ తరాలకు విజ్ఞానాన్ని పెంపొందించుటకు గ్రంథాలయాలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. పాఠకులకు అన్ని పోటీ పరీక్షల పుస్తకాలు, సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవటానికి తనవంతు ప్రయత్నిస్తానని రాష్ట్ర చైర్మన్ రియాజ్ అన్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో డాక్టర్ రియాజ్ గ్రంథాలయ వసతులు, సౌకర్యాల పై యువతను సంప్రదించగా గ్రంథాలయ భవనాన్ని విస్తరించాలని మరిన్ని పోటీ పరీక్షల పుస్తకాలు, మాసపత్రికలు అన్ని రకాలుగా సమకూర్చాలని కోరారు. ఆయన వెంట ఉమ్మడి జిల్లా గ్రంథాలయ అధికారి మనోజ్ కుమార్, స్థానిక అధికారి శాం సుందర్, వికారాబాద్ కార్యదర్శి సురేష్, రామంజనేయులు, శ్రీకాంత్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయంను ఆకస్మికంగా తనిఖీ చేసిన రాష్ట్ర చైర్మన్ రియాజ్

## జాతీయ అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న ఎమ్మెల్యే



నిర్మలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ

**ఉప్పునుంతల, అక్టోబరు 05 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల అంగన్‌వాడి కేంద్రం 1లో ఆయాగా పని చేస్తున్న నిర్మలకు ఆగస్టు 15న ఢిల్లీలో జాతీయస్థాయి ఉత్తమ అవార్డు రావడంతో శనివారం అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అచ్చంపేట పట్టణంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ జాతీయ స్థాయిలో అంగన్‌వాడి ఆయా ఉత్తమ అవార్డు అందుకోవడం రాష్ట్రానికే కాదు, జిల్లా, నియోజకవర్గానికి వన్నె తెచ్చిన ఐసిడిఎస్ బల్మూర్ ప్రాజెక్టు పరిధిలోని ఉప్పునుంతల మండల కేంద్రానికి గర్వించదగ్గ విషయమని ఎమ్మెల్యే కొనియాడారు. అంగన్‌వాడి కేంద్రంలో ఆయాగా పని చేస్తూ ఆమె నైపుణ్యాన్ని గుర్తించి హైదరాబాద్ జోన్ పరిధిలో అవార్డు రావడం గర్వించదగ్గ విషయమన్నారు.

## 7న అచ్చంపేటలో ఈజీఎస్‌పై శిక్షణ

**ఉప్పునుంతల, అక్టోబరు 05 ప్రభాతవార్త :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2025,26 సంవత్సరం వార్షిక ప్రణాళికపై ఈనెల 7న సోమవారం అచ్చంపేట ఎంపిడిఓ కార్యాలయంలో శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ మోహన్‌లాల్ తెలిపారు. ఈ శిక్షణకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరు కావాలని ఎంపిడిఓ మోహన్‌లాల్ తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించే ఈ శిక్షణా శిబిరానికి ప్రతి ఒక్కరు విధిగా హాజరు కావాలని సూచించారు.

## పెద్దాపూర్‌లో అంగరంగ వైభవంగా పూల పండగ వేడుకలు



పెద్దాపూర్‌లో బతుకమ్మలు ఆడుతున్న మహిళలు

**ఉప్పునుంతల, అక్టోబరు 05 ప్రభాతవార్త :** మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ కొత్త శిరీష రవిందర్‌రావు ఆధ్వర్యంలో పూల పండగ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. రంగు రంగు పూలతో అలంకరించిన బతుకమ్మలను పేర్చి మహిళలు సాంప్రదాయబద్ధంగా ఆడుతూ చక్కని పాటలతో బతుకమ్మ గొప్పతనాన్ని వివరిస్తూ పాటలు పాడారు.

## ఇమ్యునైజేషన్ ప్రోగ్రాంలో పాల్గొన్న భూత్పూర్ పీహెచ్‌సీ ఎంఓ డాక్టర్ రబ్



గోప్లాపూర్‌లో ఇమ్యునైజేషన్ ప్రోగ్రాంలో పాల్గొన్న డాక్టర్ రబ్

**భూత్పూర్, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** భూత్పూర్ పట్టణ మున్సిపాలిటీలోని మూడో వార్డు గోప్లాపూర్‌లో భూత్పూర్ పీహెచ్‌సీ ఎంఓ డాక్టర్ మొహ్మద్ అబ్దుల్ రబ్ శనివారం చంటి పిల్లలు, బాలింతలు, గర్భిణిలకు టీకా అవగాహన కల్పించే ఇమ్యునైజేషన్ ప్రోగ్రాంలో పాల్గొని గర్భిణీలు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ రబ్‌తో పాటు సీహెచ్ఓ అయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన బిజెపి నాయకులు...

**గద్వాల, అక్టోబర్5 ప్రభాతవార్త:** జిల్లాకేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విశ్వకర్మ రుణాలు బ్యాంకర్లు లబ్ధిదారులకు సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ బీఎం సంతోష్ కి జిల్లా అధ్యక్షుడు రామచంద్రరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డికె. స్నిగ్ధారెడ్డిలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రామచంద్ర రెడ్డి, ప్రధాన కార్యదర్శి స్నిగ్ధరెడ్డిలు మాట్లాడుతూ లబ్ధిదారులకు మార్గదర్శకాలు లేనందున లబ్ధిదారులకు పెద్ద సమస్యగా మారిందన్నారు. ఉద్యమం సర్టిఫికెట్లు లబ్ధిదారులకు అందించినప్పటికీఈ బ్యాంకు అధికారులు వాటిని ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. లబ్ధిదారులు ఎక్కువ ఉన్నందున శిక్షణ ట్రైనింగ్ సెంటర్లు పెంచాలని, సెంటర్లు పెంచినట్లయితే శిక్షణ పొందేందుకు సులభంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం ఉన్నసెంటర్లలో హైజినిక్ సౌకర్యాలు నిర్వహించడం లేదని శిక్షణ, కోసం ఉపయోగించే యంత్రాలు నాసిరకంగా ఉన్నాయన్నారు. ఈపథకం కేంద్రంప్రభుత్వం ప్రవేశపెట్టిన నిధులతో ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు కావున సెంటర్లలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఫోటో లు పెట్టడం లేదన్నారు. శిక్షణ పూర్తి అయినా తర్వాత ఎలాంటి ఎంక్వరి లేకుండా బ్యాంక్ అధికారులు లక్షరూపాయాలు ఇవ్వాలని కోరడం జరిగింది. ఈకార్యక్రమంలో అసెంబ్లీ కోకన్వీనర్ రామాంజనేయులు, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దేవా దాస్, బిజెపి సీనియర్‌నాయకులు శ్యామ్‌రావ్, డబ్బిలేటినరసింహ, మానపాడు అధ్యక్షుడు మురళీక్రిష్ణ, నరసింహులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ కు వినతిపత్రం ఇస్తున్న బిజెపి నాయకులు

## చంద్రఘంట దేవిగా అమ్మవారి దర్శనం



**ఉట్కూర్, అక్టోబరు05 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బిజ్వార్ గ్రామంలో అక్టోబర్ 5 నుండి నవ రాత్రుల్లో భాగంగా శ్రీశ్రీ శ్రీ అంబాత్రయ క్షేత్రంలో శ్రీశ్రీశ్రీ ఆదిత్య పరశ్రీ స్వామీజీ ఆధ్వర్యంలో 9 రోజులు 108 అఖండ జ్యోతులు, 74 రకాల హారతులు, బ్రహ్మ ముహూర్తంలో దేవి అష్టోత్తర శతనామ కళశాభిషేకాలు జరుగుతాయి. మూడవరోజు శనివారం అమ్మవారు చంద్రఘంట దేవిగా భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. అనంతరం శతాచండి హోమం, లక్ష కుంకుమార్చన జరిగింది. ప్రతిరోజు రాత్రి ఆలయ ప్రాంగణంలో దాండియానృత్యాలతో స్వామీజీచిన్నారులను భక్తులను ఉత్తేజరుస్తారు. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, రాష్ట్రాల నుండి వందలాది మంది భక్తులు వచ్చి భవాని మాత మాలాధారణ ధరించారు. భక్తులకు ఎలాంటి లోటు లేకుండా ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయి. ప్రతిరోజు భక్తులు వేల సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థ అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వాసవీమాత ఆలయంలో గౌరీదేవిగా అమ్మవారు



గౌరీదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు, అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

**మక్తల్ టౌన్, అక్టోబరు 05 ప్రభాతవార్త:** పట్టణంలో వెలసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వాసవి మాత లలితదేవి అలంకరణలో దర్శనం ఇచ్చారు. ఉదయం గణపతి ప్రార్థన సాయంత్రం సామూహిక కుంకుమార్చన, బతుకమ్మను ఆలయంలో మహిళలు, చిన్నారులు, ఆటపాటలతో నృత్యాలు చేశారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు వేసిన అమ్మవారి ముగ్గు అందరిని ఆకట్టుకుంది. అనంతరం పల్లకిసేవ, రథోత్సవము, శేష వాహనంపై అమ్మవారు ఊరేగింపు చేశారు. అనంతరం భక్తులకు అల్పాహారం వితరణ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, పట్టణ ప్రజలు, భక్తులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీఅన్నపూర్ణ దేవిగా అమ్మవారి దర్శనం



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**అమరచింత అక్టోబర్ 05 ప్రభాత వార్త:** విజయదశమి దేవి నవరాత్రుల ఉత్సవాల భాగంగా శనివారం మూడవరోజు శ్రీకాళికాదేవి దేవాలయంలో భక్తులకు శ్రీ అన్నపూర్ణ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే అమరచింత మున్సిపల్ చైర్ పర్సన్ మంగమ్మ నాగభూషణంగౌడ్ శ్రీకాళికాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమరచింత మున్సిపల్ కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తా, జగన్ వాడ, సంతోష్‌నగర్, శివాజీ నగర్ ఆయా వార్డులలో ఏర్పాటు చేసిన మండపాలలో ఏర్పాటు చేసిన దుర్గ మాతలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాటికొండ రమేష్, మేరువా రాజు, తిరుమల ప్రకాష్, సిద్దు రాములు, ముష్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



**పెబ్బేరు అక్టోబర్ 05 ప్రభాతవార్త:** పెబ్బేర్ పట్టణ కేంద్రం లోని దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెబ్బేరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పెబ్బేరు పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శనివారం మూడో రోజు అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి కిట్టు స్వామి అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## చంద్రఘంట దేవి, శాకాంబరి అలంకరణలో అమ్మవారు



**ఇటిక్యాల, అక్టోబరు 05 ప్రభాతవార్త:** దేవి శరన్నవరాత్రుల బ్రహ్మోత్సవాలలో భాగంగా జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో మూడవరోజు అమ్మవారు చంద్రఘంటా దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అంతేకాక మండల పరిధిలోని బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో దేవి శరన్నవ రాత్రుల ఉత్సవాలలో భాగంగా మూడవరోజు అమ్మవారు శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమి చ్చారు. దేవి శరన్నవరాత్రుల బ్రహ్మోత్సవాలలో భాగంగా జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయా నికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ఆలయాలలో ప్రత్యేక పూజలు చేస్తుండగా బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయానికి భక్తులు తరలివచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## మూడవరోజు అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనం



అన్నపూర్ణదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు, పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**తెల్కపల్లి, అక్టోబరు 05 ప్రభాతవార్త :** మండల కేంద్రంల పరిధిలోని గ్రామాలలో దుర్గామాత అమ్మవారి నవరాత్రుల వేడుకలను భక్తులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మూడవ రోజు ఉమాపతి అర్చకులు మాట్లాడుతూ మండల కేంద్రంలోని శ్రీ త్రిముఖ దుర్గాదేవి ఆలయంలో నవరాత్రుల్లో భాగంగా మూడవ రోజు అన్నపూర్ణదేవి అవతారంలో అమ్మవారు దర్శనమివ్వడంతో అమ్మవారికి భక్తులతో షోడశోపచార పూజలు, కుంకుమార్చనలు, దుర్గా హోమము నిర్వహించినట్లు తెలిపారు. అదే విధంగా గ్రామాలలో దుర్గాదేవి అమ్మవారి మండపాలు ఏర్పాటు చేసిన భక్తులు మాలలు వేసి నవరాత్రులను జరుపుకుంటున్నారు. అనంతరం నైవేద్యంగా అమ్మవారికి కొబ్బరిఅన్నం, పరమాన్నం, అన్న ప్రసాదం, తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

## బండారు సునీతకు ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు



**భూత్పూర్, అక్టోబర్ 5, ప్రభాతవార్త:** జిల్లా కవయిత్రి, ఉపాధ్యాయురాలు బండారు సునీతను శనివారం ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ప్రకటిస్తూ అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం, అహల్యా భాయ్ వోల్కర్ త్రి శతాబ్దిజయంతి ఉత్సవాల సందర్భంగా తెలంగాణ ఖరాష్ట్ర సామాజిక సమరసత వేదికగ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాజీవ్ విద్యా మిషన్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో బండారు సునీతకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డును ప్రదానం చేశారు. బండారు సునీతను శాలువలు, మెమొంటో, ప్రశంసా పత్రంతో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ దేశభవిష్యత్తు విద్యార్థుల చేతిలోనే ఉందని, విద్యార్థుల్ని ఉత్తమోత్తములుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. బండారు సునీత ఉపాధ్యాయురాలిగానే కాకుండా కవయిత్రిగా, రచయిత్రిగా సమాజానికి తన సేవలందిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమానికి మరో ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ రాజేంద్ర సింగ్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడడంతో పాటు తెలంగాణలో సేవలందించే వారిని గుర్తించి సన్మానించడం మంచి సాంప్రదాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమర సత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గన్నోజు శ్రీనివాస్, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర శర్మ, జిల్లా పీఆర్‌టీయూ సంఘం నాయకులు మదన్మోహన్ యాదవ్, సుధాకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి మండల విద్యాధికారులు కృష్ణయ్య, వెంకటాజి, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

■ అదనపు కలెక్టర్ లక్ష్మినారాయణ



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

**గద్వాల, అక్టోబర్5 ప్రభాతవార్త:** సంబంధించి దాఖలైన ఎల్ఆర్ ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మి నారాయణ అధికారులకు ఆదేశించారు. శనివారం అదనపు కలెక్టర్ రెవెన్యూ తమ చాంబర్ నందు అన్ని మండలాల ఆర్ఐలు, ఇరిగేషన్ ఎఈ అధికారులతో సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించాలని ముందుగా అన్ని దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్ నమోదు చేయాలని అధికారులకు సూచించారు. క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న సమస్యల గురించి అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను సర్వే నెంబర్ వారీగా సంబంధిత రెవెన్యూ గ్రామం మున్సిపాలిటీలో బృందాలు క్షేత్రస్థాయి పరిశీలన చేసి పక్కాగా నమోదు చేయాలన్నారు. అదే సమయంలో ఈ భూములు నీటి వనరుల బఫర్ జోన్, నాలా, చెరువులు, హెరిటేజ్ బిల్డింగ్ డిఫోన్స్ ల్యాండ్ పరిధిలో ఉన్నదాఅని పరిశీలించాలని సూచించారు. బృందంలోని సభ్యులందరూ లాగిన్ అయ్యే విధంగా చూడాలన్నారు. ఎలాంటి తప్పిదాలను ఆస్కారం లేకుండా ఎల్ఆర్ ఎస్ ప్రక్రియను పారదర్శకంగా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారి కుర్మన్న, అన్ని మండలాల ఆర్ఐలు, ఇరిగేషన్ ఎఈలు తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి సరఫరా పట్ల జాగ్రత్తలు పాటించాలి



మంచినీటి సహాయకులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న డీఈఓ హేమలత

**ఉప్పునుంతల, అక్టోబరు05 ప్రభాతవార్త:** మండలంలో మిషన్ భగీరథ ద్వారా సరఫరా అయ్యే మంచినీటి సరఫరా పట్ల మంచినీటి గ్రామ సహాయకులు జాగ్రత్తలు పాటించాలని మిషన్ భగీరథ అచ్చంపేట డివిజన్ డీఈఈ హేమలత సూచించారు. మండల కేంద్రమైన ఉప్పునుంతలలో గత ఐదు రోజులుగా మంచినీటి సహాయకులకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ ముగింపు రోజైన శనివారం ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న మంచినీటిని వృధా చేయకుండా సరఫరా చేయాలని, తరచుగా ఏర్పడే లీకేజీల నివారణ, మరమ్మతులు చేపట్టే విధానంపై అవగాహన కల్పించారు. అదేవిధంగా గ్రామాల్లో చేతిపంపులు చెడిపోయినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల మన సూచనలు సలహా అందించారు. అనంతరం శిక్షణ పొందిన మంచినీటి గ్రామ సహాయకులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ శిక్షణలో మిషన్ భగీరథ ఏఈ సాయి, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల మంచినీటి గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

## సామాజిక అసమానతలపై రాజీలేని పోరాటాలు కొనసాగిస్తాం

■ కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న



కెవిపిఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**తెల్కపల్లి, అక్టోబరు 05 ప్రభాతవార్త:** సామాజిక అసమానతలపై రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలో బస్టాండ్ దగ్గర కెవిపిఎస్ ఆవిర్భావదినోత్సవ కార్యక్రమాన్ని పురస్క రించుకుని కెవిపిఎస్ జెండావిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో వివిధ నియోజకవర్గాలలో పెండిం గ్‌లో ఉన్న ఎస్సీ కార్పోరేషన్ రుణాలు వెంటనే విడుదల చేయాలని జిన్‌కుంట లెదర్ పార్కును ప్రారంభించాలని కోరారు. కుల వివక్షత, అంటరానితనంకు వ్యతిరేకంగా సామాజిక, ఆర్థిక అంతరాలకు వ్యతిరేకంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ప్రజల తరపున నిరంతరం రాజీలేని పోరాటాలను కొనసాగిస్తుందని అన్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం 26 ఏళ్ల నుండి ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన, వివక్షత నిర్మూలనకై 1998 అక్టోబర్ 2న ఆవిర్భవించిన కెవిపిఎస్ దళిత బడుగు పీడిత వర్గాల ఐక్యతకై పని చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ మండల అధ్యక్షుడు కొంగరి కాశన్న, గోపాస్ రమేష్, అల్వాల భాస్కర్, వెంకటయ్య, సురేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లర్స్‌ల సమస్యలు పరిష్కారం చేయాలని వినతి



అదనపు కలెక్టర్ రెవెన్యూ, ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న రైస్ మిల్లర్స్

**గద్వాల అక్టోబర్ 5 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల్ జిల్లా రైస్ మిల్లర్స్ సమస్యలు పరిష్కారం చేయాలని గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మిల్లర్స్ అందరూ కలిసి వినతిపత్రం అందజేశారు. మిల్లర్స్ అనేక సమస్యలు ఎదురుకొంటున్నారని వాటి పరిష్కా రం కోసం ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇవ్వడం జరిగిందని అధ్యక్షులు శేఖర్‌రెడ్డి తెలిపారు. అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన రైస్ మిల్లర్స్... జోగులాంబ గద్వాల జిల్లా రైస్‌మిల్లర్స్ ఓనర్స్ అసోసి యేషన్ అధ్యక్షులు శేఖర్‌రెడ్డి నాయకత్వంలో శనివారం అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మినారాయణ ను కలిసి వినతిపత్రం అందజేశారు. రైస్ మిల్లర్స్ ఎదురుకొంటున్నా సమస్యలు తక్షణమే పరిష్కారం చేయాలని కోరినట్లు అధ్యక్షులు శేఖర్‌రెడ్డి తెలిపారు. సభ్యులు పాండు, మురళి, శీల అశోక్, మధు, గార్లపాడు, సుదర్శన్ ఉన్నారు.

## సమస్యల వలయంలో పెబ్బేరు మోడల్ స్కూల్

**సమస్యలు పరిష్కారం చేయాలని ఎమ్మెల్యేకు స్కూల్ అధ్యాపక బృందం వినతి**



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న మోడల్ స్కూల్ సిబ్బంది

**పెబ్బేరు అక్టోబర్ 05 ప్రభాతవార్త :** పెబ్బేర్ ఆదర్శ పాఠశాలల్లో ఏళ్ళ తరబడి అపరిష్కృతంగా నెలకొని వున్న సమస్యల పరిష్కారం కోసం శనివారం వనర్తి శాసనసభ్యుడు మేఘారెడ్డిని కలిసి వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది. జాతీయ రహదారి వేసినప్పుడు మట్టిని త్రవ్వి వాడుకోవడం వల్ల ఆదర్శ పాఠశాల క్రీడా మైదానంలో ప్రాంతం గుంతగా మారింది. వర్షాకాలంలో కుసిసిన వర్షపు నీరు పాఠశాల ప్రాంగణంలో నిలిచి చిన్న చెరువుగా మారింది. పల్లపు ప్రదేశం కాబట్టి ఆ నీరు అక్కడే నిలిచి పోతుంది. నెలల తరబడి నీరు నిల్వ వుండడం వల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాఠశాలకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. నీరు నిల్వ వుండడం వల్ల పరిసర ప్రాంతాలు బురదమయంగా మారి విద్యార్థులు ఆడుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. అదే విధంగా ఆదర్శ పాఠశాలకు ఆనుకొని జాతీయ రహదారి వుంది. పాఠశాలకు ఎదురుగా యుటర్న్ లేకపోవడం వల్ల విద్యార్థులు జాతీయ రహదారికి వ్యతిరేఖ మార్గంలో పయనిస్తూ పాఠశాలకు వెళ్తున్నారు. ఆ సందర్భంగా విద్యార్థులు , తల్లిదండ్రులు, అధ్యాపకులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయం శాసనసభ్యులు మేఘారెడ్డి స్పందిస్తూ యుటర్న్ విషయం ఎన్‌హెచ్44 సిఈఓతో మాట్లాడుతానని, పాఠశాలకు వెళ్లడానికి మట్టిరోడ్డును వేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ , పెబ్బేర్ ప్రధానాచార్యులు డా. తూర్పింటి నరేష్ కుమార్, అధ్యాపకులు గంగాధర్ , డా. బుచ్చయ్య, ఫకీరయ్య, డా. నాగరాజులు పాల్గొన్నారు.

## ముగిసిన ఇంటింటి డిజిటల్ సర్వే



డిజిటల్ సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

**చిన్నచింతకుంట, అక్టోబరు05 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డిజిటల్ కార్డులు తీసుకొస్తుంది. రేషన్ కార్డుల స్థానంలో డిజిటల్ కార్డుల సర్వే కోసం ప్రతి నియోజక వర్గంలో ఒక గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేసుకుని ఆ గ్రామంలో ఇంటింటి డిజటల్ సర్వే అధికారులతో కొనసాగించింది. దేవరకద్ర నియోజకవర్గంలో మండలంలోని సీతారాంపేట గ్రామాన్ని పైలట్ గ్రామంగా ఎంపిక చేసుకుని వివిధ శాఖల అధికారులు గ్రామంలో మూడు రోజుల పాటు ఇంటింటి డిజిటల్ సర్వేను జరిపింది. ప్రతి ఇంటికి వెళ్లి వారి స్థితిగతులను నమోదు చేసుకున్నట్లు దేవరకద్ర ఎంపిడిఓ శ్రీనివాసరావు, సిసికుంట ఎంపిఓ అనిల్‌కుమార్, ఎపిఎం విష్ణుచారి, అర్ఐ శశి కిరణ్‌లు తెలిపారు. గ్రామంలో 157 ఇండ్లను డిజిటల్ సర్వే చేసినట్లు అధికారులు తెలిపారు. డిజిటల్ సర్వేను పకడ్బందీగా, పారదర్శకంగా జరపాలని ఉన్నత స్థాయి అధికారులు ఆదేశం మేరకు డిజిటల్ సర్వేను జరిపినట్లు అధికారులు తెలిపారు. శనివారంతో గ్రామంలో ఇంటింటి డిజిటల్ సర్వే ముగిసిందని తెలిపారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**ఖిల్లాఘణపురం అక్టోబర్05 ప్రభాతవార్త:** మండల కేంద్రంతో పాటు మండలంలో పలువురికి ఏఐసీసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ జిల్లా ఆదిత్యరెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కోఆర్డినేటర్ జిల్లా ఆదిత్య రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. శని వారం మండల కేంద్రానికి చెందిన నందిని వెంకటమ్మ, చంద్రశేఖర్ ఉప్పరపల్లి గ్రామానికి చెందిన వి మల్లమ్మ, కోతుల కుంట గ్రామానికి చెందిన మూడవ శంకర్ లకు నేరుగా వారి గ్రామాల్లో నివా సాలకు చేరుకుని జిల్లాకాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ కుమార్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యర్తలను వెంబడి పెట్టుకొని చెక్కులను అందజేశారు. ఆదిత్య రెడ్డి నేరుగా తమ నివాసాలకు వచ్చి చెక్కులు ఇవ్వడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గంజాయి రమేష్ ,డాక్టర్ నరేందర్‌గౌడ్, దామోదర్‌రెడ్డి, దేవన్న ముజాహిద్, అజీమ్ ఎల్లాగౌడ్, ప్రవీణ్‌రెడ్డి , భాస్కర్ ఆంజనేయులు, గట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు

**నారాయణపేట టౌన్, అక్టోబరు 05 ప్రభాత వార్త:** దసరా పండుగ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం నారాయణపేట పట్టణంలోని సాయి హనుమాన్ కాలనీలో ప్రతిష్టించిన దుర్గమాత మండపం దగ్గర మహిళలు బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటం, బొడ్డెమ్మలు ఆటపాటలతో ఆనంద్ ఉత్సవాల మధ్య వేడుకలు జరుపుకున్నారు. మహిళలు ఆడిన ఆటపాటలు ఆకట్టుకున్నాయి. అనంతరం గ్రామ చెరువులో నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు. దుర్గామాత మంటపం కమిటి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ సంబరాలలో మహిళలు

## భక్తులకు అన్నప్రసాద వితరణ



భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్న దృశ్యం

**మక్తల్, అక్టోబరు 05 ప్రభాతవార్త:** పట్టణానికి చెందిన భూపని వెంకటమ్మ 55వ జయంతి సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు శనివారం మక్తల్ పడమటి ఆంజనేయస్వామి ఆలయం వద్ద పేదలకు అన్నదానం చేపట్టారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని వెంకటమ్మ భర్త, విశ్రాంత పీఈటీ బి. గోపాలం తెలిపారు. అంతకు ముందుఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమం లో కుటుంబసభ్యులు బి. రూప, బి. దీప, బి. శిల్ప, బి. పుష్ప, డి. రాము, కె. రాజు, రవి, బి. చిన్న వెంకటేష్, పెన్షనర్స్ సంఘ ప్రధాన కార్యదర్శి బి. భాస్కర్, కోశాధికారి సిద్ధి లింగయ్య, సూర్యప్రకాష్, తులసప్ప, అరుణ, సుజాత, విద్యావతి, నర్సమ్మ, కిష్టయ్యగౌడ్, మల్లికార్జున్, మౌలానా పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం



వయోవృద్ధుల దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**ఉట్కూర్, అక్టోబరు 05 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో శనివారం రోజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. సౌభాగ్యలక్ష్మి ఆదేశాల మేరకు అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా 60 సంవత్సరములు దాటిన వయోవృద్ధులకు పరీక్షలు నిర్వహించి వారికి ఆరోగ్యంపట్ల తీసుకోవాల్సినజాగ్రత్తల గురించి అవగాహన కల్పించడం జరిగింది. డా. శ్రీలత, ఆరోగ్య విస్తరణ అధికారివిజయకుమార్, ఆరోగ్య పర్య వేక్షకులు నరసింహులు, ఆరోగ్య కార్యకర్త శైలజ, ఫార్మాసిస్టు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## శంకర్ మృతి పట్ల సంతాపం



మృతునికి నివాళులు అర్పిస్తున్న మార్కెట్ యార్డ్ వైస్‌చైర్మన్

**పెబ్బేరు అక్టోబర్ 05 ప్రభాతవార్త:** పెబ్బేరు మున్సిపాలిటీ పరిదిలోని చెలిమిళ్ళ మున్సిపల్ సిబ్బంది. శంకర్ అనారోగ్య రీత్యా చనిపోయిన విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వారి భౌతిక కాయానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేయడం జరిగింది. ప్రభుత్వపరంగా వారి కుటుంబానికి అండగా ఉంటా మని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాంపురం సహదేవుడు, జనపెటా మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుని కుటుంబానికి నగదు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**పెబ్బేరు అక్టోబర్ 05 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలం యాపర్ల గ్రామానికి చెందిన కావాలి రాజేష్ చనిపోయిన విషయం మాజీ సర్పంచ్ చంద్రకళ విక్రమ్ గౌడ్ సమాచారం అందించగా వెంటనే స్పందించిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి కుమారుడు వనపర్తి నియోజకవర్గం యువ నాయకులు డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి వారి కుటుంబానికి తీవ్ర సంతాపం తెలిపి దహన సంస్కారాల ఖర్చు నిమిత్తం 5000/- రూపాయలను వారి కుటుంబానికి అందించాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామాపురం సహదేవుడు, మాజీ సర్పంచ్‌లు రాజశేఖర్ గౌడ్, చంద్రకళ విక్రమ్ గౌడ్, తోమాలపల్లి కృపాకర్‌రెడ్డి, రాజునాయక్, పాతపల్లి చంద్రశేఖర్, పెద్ద మదిలేటి, కావాలి గోపాల్, కే రవికుమార్ పాల్గొన్నారు.

## నూతన తహసీల్దార్‌కు ఘన సన్మానం



**చిన్నచింతకుంట, అక్టోబరు 05 ప్రభాతవార్త:** మండలానికి నూతన తహసిల్దార్‌గా ఎల్లన్న రావడంతో శనివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ గ్రామాల పార్టీ నేతలు తహసిల్దార్ కార్యాలయంలో శాలువాతో సత్కరించారు. మండల అభివృద్ధిలో తహసిల్దార్‌కు అన్ని విధాల కాంగ్రెస్ పార్టీ సహకరిస్తుందని నేతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, మండల కో ఆప్షన్ మాజీ సభ్యులు మహమూద్, జాకీర్, దేవరకద్ర నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్. వెంకటేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వట్టెం శివకుమార్, గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, పార్టీ కార్యదర్శి జి. ప్రతాప్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లికార్జున్, విష్ణువర్ధన్‌రెడ్డి, అర్జున్, ఎండిగౌస్, ప్రవీణ్, కె. చిన్నా, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేతకు సన్మానం



**భూత్పూర్, అక్టోబర్5, ప్రభాతవార్త:** భూత్పూర్ పట్టణానికి చెందినభారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) నాయకుడు టి మురళి ధర్‌గౌడ్(టీఎం గౌడ్) విదేశీ పర్యటన ముగించుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన సందర్భంగా శనివారం భూత్పూర్‌లోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ నాయకులు టీఎం గౌడ్‌ను పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు. టీఎం గౌడ్ రెండు నెలల క్రితం సతీసమేతంగా ఆస్ట్రేలియాలో పర్యటించారు. విదేశీ పర్య టనను ముగించుకుని భూత్పూర్‌కు చేరకున్న టీఎంగౌడ్‌ను బీఆర్ఎస్ నాయకులు మొహ్మద్ సాధిక్, గడ్డం యాదయ్య, గడ్డం రాములు, శ్రీశైలం, మొహ్మద్ శాకీర్, శేఖర్, నాగేందర్, రామస్వామి, మొహ్మద్ బాబా శర్ఫొద్దిన్, మొహ్మద్ ఖదర్ తదితరులున్నారు.

## కురుమూర్తి బ్రహ్మోత్సవాలు..

మొదటి పేజీ తరువాయి భాగం..

లేకుండా తాగునీరు సరఫరా చేయాలని, 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, అదే విధంగా జనరేటర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎక్సైజ్‌శాఖ ద్వారా అవసరమైనంత మంది సిబ్బందిని ఏర్పాటు చేసి బెల్టు షాపులను మూసివేయడమే కాకుండా మద్యం అమ్మకాలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. భక్తులకు అన్ని విషయాలు తెలిసే విధంగా సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని, ఆర్టీసి ద్వారా తగినన్ని బస్సులు నిర్వహించాలని, పంచాయతీరాజ్ శాఖ ద్వారా శానిటేషన్‌కు ఎక్కువ మంది సిబ్బందిని ఏర్పాటు చేసి పారిశుద్ధ్య సమస్య రాకుండా చూసుకోవాలని అన్నారు. బ్రహ్మోత్సవాలపై జిల్లాలోని ప్రజలతో పాటు, ఇతర ప్రాంతాలకు తెలిసే విధంగా విస్తృత ప్రచారం గావించాలని డిపిఆర్ఓను ఆదేశించారు. ముఖ్యమైన రోజులలో అవసరమైతే ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని అన్నారు. అన్ని శాఖల అధికారులతో బ్రహ్మోత్సవాలు నిర్వహించే స్వామివారి దేవాలయంను సందర్శించి సమీపంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి ఏర్పాట్లపై సమీక్షించనున్నట్లు తెలిపారు. పోలీస్‌శాఖ ద్వారా బందోబస్తు, శాంతి భద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

**సమ్మక్క, సారక్క జాతర తరహాలో భక్తులు : ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి**

దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సమక్క, సారలమ్మ జాతర తర్వాత శ్రీ కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారని, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో జాతరను విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. నవంబర్ 6న అలంకార ఉత్సవం, నవంబర్ 8న ఉద్దాల ఉత్సవం ప్రధాన ఘట్టాలని తెలిపారు. ముఖ్యంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యే రోజుల్లో ఆయా శాఖల అధికారులు ముఖ్యంగా పంచాయతీరాజ్ శాఖ అధికారులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఏర్పాట్లు చేయాలని అన్నారు. పోలీస్ శాఖ పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేయాలని అన్నారు. దేవరకద్ర నుండి కురుమూర్తి దేవాలయానికి వచ్చే దారిలో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వద్ద రెండు చోట్ల డైవర్షన్ చేసిన సర్వీస్ రోడ్లు బాగా లేవని రిపేర్ చేయాలని సూచించారు. ఆర్‌టిసి భక్తులకు ఉమ్మడి మమబూబ్ నగర్, హైద్రాబాద్ నుండి వచ్చే భక్తులకు బస్సులు ఏర్పాటు చేయాలని అన్నారు. టాయిలెట్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యుత్ శాఖ లైటింగ్‌కు నిరంతరాయ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు బ్రహ్మోత్సవాలు ఏర్పాట్లు పర్యవేక్షించాలని సూచించారు. సామాన్య భక్తుల దర్శనంకు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. స్థానిక సంస్థలఅదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, అడిషనల్ ఎస్పీ రాములు, డిఆర్ఓ కెవివి రవికుమార్, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ శ్రీనివాస్‌రాజు, కురుమూర్తి స్వామిదేవాలయం ఛైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓమదన్‌రెడ్డి, జిల్లా అధికారులు, చిన్నచింతకుంట మండల అధికారులు తదితరులు హాజరయ్యారు.

## మొహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

### - కల్వకుర్తి ముస్లిం జేఏసీ

**కల్వకుర్తి, అక్టోబర్ 05 ప్రభాతవార్త:** మొహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని, అలాంటి వారిని పోలీసులు వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కల్వకుర్తి ముస్లిం జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఘజియాబాద్ ప్రాంతానికి చెందిన నారింగ నాథ్ అనే పూజారి ఓ బహిరంగ సభలో మొహమ్మద్ ప్రవక్తపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా శనివారం కల్వకుర్తి పట్టణంలో ముస్లిం జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో ముస్లిం మత గురువులు, యువకులు పాతబస్తీలోని జామ మస్జీద్ నుంచి పాలమూరు చౌరస్తా వరకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం నారింగనాథ్ పూజారి దిష్టిబొమ్మను దగ్ధం చేసి అతనిపై పోలీసులు చట్టరీత్య కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఘజియాబాద్ ప్రాంతానికి చెందిన నారింగనాథ్ అనే పూజారి ఓ బహిరంగ సభలో మొహమ్మద్ ప్రవక్త పట్ల అవమానకర తప్పుడు వ్యాఖ్యలు చేయడం సరైన పద్దతి కాదన్నారు. ఇలాంటి అనుచిత వ్యాఖ్యల వల్ల దేశ వ్యాప్తంగా శాంతియుత వాతావరణంలోఅన్నదమ్ముల వలె కలిసిమెలిసి వెలుగుతున్న హిందు, ముస్లిం సోదరుల్లోమత విద్వేశాలుచోటు చేసుకునే ప్రమాదం నెలకొందన్నారు. ముస్లిం సమాజానికి నారింగ నాథ్ పూజారి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముస్లిం జేఏసీ నాయకులు ఏజాస్, తాహేర్‌అలీ, మక్బూల్, సత్తార్, పప్పు,మసూద్, ఖాదర్, విక్కి, ఇంతియాజ్, సోఫి, ఖాదర్, యాహియాఖాన్, నాసర్‌ఖాన్, సోఫి, ఖుద్దుస్, అచల్, మత గురువులు తదితరులు ఉన్నారు.

## దేశం కాంగ్రెస్ నాయకత్వాన్ని కోరుతోంది

**-మహారాష్ట్రలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే : టీపీసీసీ అధికార ప్రతినిధి ఠాకూర్ బాలాజీసింగ్**

**కల్వకుర్తి, అక్టోబర్ 05 ప్రభాతవార్త:** దేశం కాంగ్రెస్ నాయకత్వాన్ని కోరుతుందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి ఠాకూర్ బాలాజీసింగ్ పేర్కొన్నారు. శనివారం ఆయన మహారాష్ట్రలోని యావత్‌మాల్ జిల్లా దిగ్రేస్ నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన దిగ్రేస్ నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎవరికైతే టికెట్ కేటాయిస్తే వారి కోసం కష్టపడి పనిచేయాలన్నారు. స్థానిక భాషలో మాట్లాడి కార్యకర్తలను ఉత్తేజ పరిచారు. ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. మహారాష్ట్రలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. అంతకు ముందు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి ఠాకూర్ బాలాజీ సింగ్‌ను మహారాష్ట్ర నేతలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాణావత్ శంకర్‌నాయక్, రామస్వామి తదితరులు ఉన్నారు.

## బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్ దంపతులు





**భూత్పూర్, అక్టోబర్ 5, ప్రభాతవార్త:** బతుకమ్మ సంబరాల్లో భాగంగా మూడో రోజు శనివారం భూత్పూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముద్దపప్పు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు .వేడుకలకు దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) ఆయన సతీమణి కవిత ముఖ్య అతిథులుగా హాజరై బతుకమ్మ ఆడారు. అనంతరం ఏర్పాటైన సమావేశంలో ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి,సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన పూల పండు గ బతుకమ్మ అని అభివర్ణించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా మహాలయ అమావాస్య మరుసటి రోజు నుంచి నిర్వహించే దేవీ శరన్నవరాత్రులతో పాటు బతుకమ్మ ఉత్సవాలు నిర్వహిస్తారన్నారు. తీరొక్క పువ్వుతో అందంగా బతుకమ్మలను తీర్చిదిద్ది తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ సంబరాల్లో మహిళలు, అమ్మలక్కలు, బాలికలు పాల్గొంటారన్నారు. కళాశాలలో తెలంగాణ సాంస్కృతికి అద్దం పట్టేలా బతుకమ్మ వేడుకలు నిర్వహించారని, ఈ వేడుకలకు తమను ఆహ్వానించడం సంతోషకరమని పేర్కొన్నారు. బతుకమ్మనెత్తి ఆడిన ఎమ్మెల్యే జీఎంఆర్ దంపతులు కళాశాల మహిళా అధ్యాపకులు, బాలికలు తయారు చేసిన పెద్ద బతుకమ్మను ఎమ్మెల్యే సతీమణి కవిత ఎత్తుకుని కొద్ది సేపు బతుకమ్మ ఆటను కళాశాల బాలికలు, నాయకులు, కళాశాల సిబ్బందితో కలిసి ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి లిక్కి విజయ్‌గౌడ్, మండల ఓబీసీ సెల్ అధ్యక్షుడు జైదు శ్రీనివాసులు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నర్సింహులుతో పాటు నాయకులు బోరింగ్ నర్సింహులు, గడ్డంఎల్లప్ప, కోరె పవన్, యాదయ్య, చెన్నమ్మ, శివరాములుతో పాటు కళాశాల ప్రిన్సిపాల్ విజయ భాస్కర్ గుప్త, ఎమ్మెల్యే జీఎంఆర్ సతీమణి కవిత స్నేహితురాలు, కళాశాల అధ్యాపకురాలు కవిత పాల్గొన్నారు.

## ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ..

**- పాలమూరు రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు**

**- పాల్గొన్న ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం సతీమణి లక్ష్మీప్రసన్న**

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 5, ప్రభాతవార్త:** ఉమ్మడి పాలమూరులో ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ..ఏమేమి కాయొప్పునే గౌరమ్మ..చిత్తూ చిత్తూల బొమ్మ శివుడి ముద్దుల గుమ్మా..బంగారు బొమ్మ దొరికెనమ్మ ఈ వాడలోనా..అంటూ బతుకమ్మ పాటలో ఆడిపాడారు. పాలమూరు రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబురాల్లో మహబూబ్‌నగర్‌లోని దొడ్డలోనిపల్లి రెడ్డి హాస్టల్ ఆవరణలో గౌరమ్మ పూజలు చేసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని బతుకమ్మ ఆడారు. స్థానిక మహిళలతో కలిసి ఎంపీ డీకే అరుణమ్మ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సతీమణి లక్ష్మీప్రసన్న బతుకమ్మ పాటలతో ఆడిపాడారు.



# బిజెపిలో ఫుల్ జోష్

- మహబూబ్‌నగర్‌లో జోరుగా బిజెపి సభ్యత్వాలు
- మెంబర్‌షిప్ డ్రైవ్‌లో పాల్గొని సభ్యత్వాలు నమోదు చేయించిన ఎంపి డికె అరుణ, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో జెండా ఎగరేయాలి : ఎంపి డికె అరుణ



సభ్యత్వాలు అందజేస్తున్న ఎంపి డికె అరుణ

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు05 ప్రభాతవార్త:** పాలమూరులో బిజెపి సభ్యత్వాల జోష్ మొదలైంది. మెంబర్షిప్ డ్రైవ్‌లో భాగంగా మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ సభ్యత్వాల నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. వార్డు నంబర్ 6లో స్థానిక బిజెపి కార్యకర్తలకు బిజెపి జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎంపి అరుణమ్మ సభ్యత్వాలు అందజేశారు. ఈ సందర్భంగా డిజిటల్ సభ్యత్వ నమోదుపై పార్టీ కార్యకర్తలకు ఆమె అవగాహన కల్పించారు.

**స్థానిక సంస్థల్లో సత్తా చాటాలి:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి జెండా ఎగురవేయాలని మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ పిలుపునిచ్చారు. సర్పంచ్ ఎంపిటిసి, జడ్పీటిసి మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటాలని సూచించారు. స్థానిక సంస్థల్లో విజయకేతనం ఎగురవేయాలంటే ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలని అందులో భాగంగానే సభ్యత్వాల నమోదు క్రియాశీలకంగా చేపట్టాలని కోరారు. ప్రతి ఒక్క కార్యకర్త 100 మందితో సభ్యత్వాలు చేయించాలన్నారు. అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ప్రతి కార్యకర్త కేంద్ర ప్రభుత్వపథకాలను ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిజెపి క్రమశిక్షణ కమిటి సభ్యురాలు పద్మజారెడ్డి, జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంట్లో బిజెపి సభ్యత్వం పొందాలి : ఎంపి డికె అరుణ



పార్టీ సభ్యత్వ నమోదు అందజేస్తున్న ఎంపి డికె అరుణ

**నారాయణపేట టౌన్, అక్టోబరు 05 ప్రభాతవార్త:** దేశ అభివృద్ధి, దేశ రక్షణ కోసం, సనాతన ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఇంట్లో బిజెపి సభ్యత్వం పొందాలని పాలమూరు ఎంపి డికె అరుణ కోరారు. శనివారం జిల్లాలోని కోటకొండ గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంట్లో ప్రతి ఒక్కరూ సభ్యత్వము చేయాలని కోరుతూ ప్రతిఒక్క నాయకుడు రేపు జరగబోయే స్థానిక ఎన్నికల్లో పదవులు కావాలంటే ప్రతి ఒక్కరు రూ.100 నుండి రూ.200ల మధ్యలో ప్రతి ఒక్కరు సభ్యత్వం చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షులు పగుడాకుల శ్రీనివాసులు, రాష్ట్ర ఓబిసి నాయకులు కెంచె శ్రీనివాస్, మండల అధ్యక్షులు బైరంకొండ సాయిబన్న, జికె నరసింహులు, పేట కౌన్సిలర్ సత్య రఘుపాల్‌రెడ్డి, బిజెవైఎం ఉపాధ్యక్షులు వేపూర్ రవి కుమార్, ఓబిసి నాయకులు రామకృష్ణ, ధన్వాడ మాజీ ఎంపిటిసి సుంకు ఉమేష్, కోటకొండ బిజెపి నాయకులు కొంగర రాములు, భగవాన్ శంకర్, వేపూరి నర్సిరెడ్డి, ఉట్కూర్ సంతోష్, మణికంఠ, చెవుల నరేష్, చుక్క జనార్ధన్, సాయికుమార్, చెవుల కృష్ణయ్య, చాకలి నవీన్, బాలస్వామి, బాలప్ప, అంగిడిలి దస్తప్ప, చాకలి రాము, ప్యాట నరేష్, రామకృష్ణతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో సీఎం సతీమణి గీతారెడ్డి

**- ఆలయ అభివృద్ధికి ఉత్సవ కమిటీకి రూ.1లక్ష విరాళం - సీఎం సతీమణికి ఘన సన్మానం**



ఆలయ అభివృద్ధికి రూ.1లక్ష విరాళం అందజేస్తున్న సీఎం సతీమణి గీతారెడ్డి

**కల్వకుర్తి, అక్టోబర్ 05 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని వాసవీకన్యకా పరమేశ్వరి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు దేవాలయ ఫౌండర్ ట్రస్టీ జూలూరి రమేష్‌బాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు గంప శ్రీనివాసులు ఆధ్వర్యంలో కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. శనివారం 3వ రోజు అమ్మవారు అన్నపూర్ణదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సతీమణి ఎనుముల గీతారెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ జూలూరి రమేష్‌బాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు గంప శ్రీనివాసులుతో పాటు మహిళలు సీఎం సతీమణి ఎనుముల గీతారెడ్డిని శాలువాలతో సన్మానించి మెమోంటోను బహుకరించారు. సీఎం సతీమణిగీతారెడ్డికి అమ్మవారి వస్త్రాలను కానుకగా అందించారు.

**ఆలయ అభివృద్ధికి రూ.1లక్ష విరాళం అందజేత:** శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో సీఎం సతీమణి ఎనుముల గీతారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి యేటా అమ్మవారిని దర్శించుకొని అమ్మవారి ఆశీస్సులు పొందుతారని ఆమె పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి రూ.1లక్ష విరాళాన్ని ఆమె అందించారు. ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందిస్తానన్నారు.



సీఎం సతీమణి గీతారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

## భూముల క్రమబద్ధీకరణ పారదర్శకంగా ఉండాలి



ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న డిఎల్‌పిఓ

**బిజినపల్లి, అక్టోబరు 05 ప్రభాతవార్త :** భూముల క్రమబద్ధీకరణ సంబంధించి దాఖలైన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని డిఎల్‌పిఓ వరలక్ష్మి సూచించారు. శనివారం పాలెం గ్రామంలో మొబైల్ యాప్ ద్వారా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పరిశీలించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించాలని, ముందుగా అన్ని దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని పంచాయతీ సెక్రెటరీలకు సూచించారు. సర్వే నంబర్లు, ప్లాట్ అప్లికేషన్ల సంఖ్య, రోడ్డు విస్తీర్ణం, ఇనాం భూమివంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని డిఎల్‌పిఓ వరలక్ష్మి సూచించారు. దరఖాస్తుదారులను అనవసర ఇబ్బందులకు గురి చేయకూడదని, క్షేత్రసస్థాయి ఇబ్బందులకు గురి చేయకూడదని, క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లడానికి ముందే దరఖాసుదారులకు సమాచారం అందిస్తే, వారు ప్లాట్ స్థలంలో అందుబాటులో ఉంటారని, క్షేత్రస్థాయి పరిశీలనలో అది ప్రైవేట్ స్థలమేనా, లేక ప్రభుత్వ స్థలమా అన్నది పక్కాగా నిర్ధారించుకోవాలని అన్నారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ నరసింహులు, పంచాయతీ సెక్రెటరీ సందీప్, మాజీ ఎంపిపి శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇది కదా ప్రజా పాలన

**సచివాలయం క్యాంటిన్‌లో మధ్యాహ్న భోజనం చేసిన ఎమ్మెల్యేలు**



క్యాంటిన్‌లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యేలు

**మహబూబ్‌నగర్, అక్టోబరు 05 ప్రభాతవార్త:** ప్రజాపాలన అంటే ఎలా ఉంటుందో మాటలలో చెప్పడం కాదు చేతల్లో చూపిస్తూ, ప్రజల మధ్యనే నిత్యం ఉంటూ, ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ, వారి సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించడమే కాదు వారితో కలిసి సాధారణ పౌరుల్లాగా డా. బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఉన్న క్యాంటిన్‌లో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యేయెన్నం శ్రీనివాస్ రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, పిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్‌తో కలిసి మధ్యాహ్నభోజనం చేశారు. నియోజకవర్గం అభివృద్ధి పనుల నిమిత్తం సచివాలయానికి వెళ్లిన ఎమ్మెల్యేలు మధ్యాహ్న భోజనం సమయం కావడంతో సామాన్యులతో కలిసి సచివాలయం క్యాంటిన్‌లో మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగాఈ సచివాలయానికి వివిధపనులపై వచ్చినప్రజలు ఆశ్చర్యపోయారు. ఇది కదా ప్రజాపాలన అంటే ప్రజాప్రతినిధులు సామాన్య ప్రజలతోకలిసిమమేకమవడంఅంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## నేడు పేటలో విద్యుత్ అంతరాయం

**నారాయణపేట టౌన్, అక్టోబరు 05 ప్రభాతవార్త:** పట్టణంలో ఆదివారం ఉదయం 10 గం.ల నుండి 2 గం.ల వరకు 11 కెవి ఫీడర్ పనుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ మహ్మద్ రఫీ తెలిపారు. సివిల్ 1 ఫీడర్ పరిధిలో, చౌక్ బజార్, దర్గా ఏరియా, కుమ్మరివాడి, కలాల్‌వాడి, బహార్‌పేట్, దామరగిద్ద రోడ్, ఏరియా వస్తాయి. విద్యుత్ వినియోగదారులు, వ్యాపారస్తులు అంతరాయానికి సహకరించాలని ఏఈ కోరారు.

## వృద్ధులకు సేవ చేయడం అదృష్టంగా భావించాలి

**- జిల్లా అడిషనల్ కలెక్టర్ సీతారామారావు**

**కల్వకుర్తి, అక్టోబర్ 05 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలో ప్రజల భాగస్వామ్యసంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమ నిర్వాహకులు పి.వెంకటయ్యను జిల్లా అధికారులు ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని డిఓ రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి జిల్లా అడిషనల్ కలెక్టర్ సీతారామారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వృద్ధులకు సేవ చేయడం అదృష్టంగా భావించాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తూ వృద్ధులకు సేవలు అందిస్తున్న టీపీఎస్ అధ్యక్షులు పి.వెంకటయ్యను డిడబ్ల్యూఓ రాజేశ్వరి పలువురు అధికారులు శాలువాలతో సన్మానించిమెమోంటోను అందించారు. కార్యక్రమంలో పలువురు అధికారుల, వయోవృద్ధుల కమిటీ నాయకులు, వృద్ధులు తదితరులు ఉన్నారు.

## వాహనాలకు సరైన పత్రాలు కలిగి ఉండాలి : ఎస్సై

**నారాయణపేట టౌన్, అక్టోబరు 05 ప్రభాతవార్త :** వాహనాలకు సరైన పత్రాలు కలిగి ఉండాలని ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సావర్కర్ చౌరస్తాలో, ఎర్రగుట్ట దగ్గర ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు వాహనాలకు సరైన పత్రాలు కలిగి ఉండాలని లేని ఎడల వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై గాయత్రి, ఏఎస్సై ఆంజనేయులు, పోలీసులు హన్మంతు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో సమస్య పరిష్కారం

**నారాయణపేట టౌన్, అక్టోబరు 05 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలం కానుకుర్తి గ్రామంలో రోడ్డుపైన విద్యుత్ తీగలు ఉండడం వల్ల రైతులకు తీవ్ర ఇబ్బందికరంగా ఉంది. పొలాలకు వచ్చిపోయే రైతులు ఈ సమస్యను పరిష్కరించాలని అధికారులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకోలేదని వాపోయారు. విషయాన్ని రైతులు ఎమ్మెల్యే పర్ణికరెడ్డి దృష్టికి తీసుకు వెళ్లడంతో స్పందించిన ఎమ్మెల్యే ఏఈతో మాట్లాడి సమస్యను పరిష్కారం చేయించారు. సమస్య పరిష్కారం పట్ల గ్రామ రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## అన్నపూర్ణాదేవి అవతారంలో అమ్మవారు

**చిన్నచింతకుంట, అక్టోబరు 05 ప్రభాతవార్త:** మండలంలో వివిధ గ్రామాలలో దేవీ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శనివారం దుర్గామాత అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని బండరుపల్లి, లాల్‌కోట, పళ్లమర్రి, చిన్నచింతకుంట, ముచ్చింతల, తిరుమలాపూర్, కురుమూర్తి తదితర గ్రామాలలో దేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలోని శ్రీగంగాభవాని ఆలయంలో భక్తులకు ఉచిత అన్నదానాన్ని నిర్వహించారు. దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆయా మండపాల వద్ద మహిళలు బొడ్డెమ్మలు, చిన్నారులు కోలాటాలతో సందడిగా మారాయి.

## గడ్డం వెంకటస్వామి జీవితం ప్రజలకు ఎంతో ఆదర్శం : డీఎస్పీ

**నారాయణపేట టౌన్, అక్టోబరు 05 ప్రభాతవార్త:** స్వాతంత్ర సమర యోధుడు, కేంద్ర మాజీ మంత్రి భారత జాతీయ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దివంగత గడ్డం వెంకటస్వామి జయంతి సందర్భంగా శనివారం డీఎస్పీ ఎన్. లింగయ్య గడ్డం వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆర్ఐ నరసింహ, డిపిఓ సూపరింటెండెంట్ శంకర్‌లాల్, ఆర్ఎస్సై శివశంకర్, డిపిఓ డిసిఆర్బీ స్టాఫ్, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలి

### -మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్

**కల్వకుర్తి, అక్టోబర్ 05 ప్రభాతవార్త:** గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూం నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ గుత్తేదారులకు సూచించారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక చొరవతో పట్టణంలోని డబుల్ బెడ్‌రూం ఇండ్ల వద్ద మిగిలిపోయిన నిర్మాణ పనులను శనివారం మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి పంపిణీ చేయడంలో గత ప్రభుత్వం విఫలమైందన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవతో డబుల్ బెడ్‌రూం నిర్మాణ పనులు నాణ్యతగా త్వరితగతిన పూర్తి చేసి అర్హులైన లబ్దిదారులకు అందిస్తామని తెలిపారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల పరిశీలనలో మాజీ సర్పంచ్ వెంట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులుచిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు షానవాజ్‌ఖాన్, మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, నానియాదవ్, జమ్ములశ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

## కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబురాలు

**కల్వకుర్తి, అక్టోబర్ 05 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ పండుగ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాంరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు తెచ్చిన తీరొక్క పూలతో అందమైన బతుకమ్మలను తయారు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ రాంరెడ్డి గౌరీ దేవి పూజ చేసి కార్యక్రమాలు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాంరెడ్డి మాట్లాడుతూ ఆడబిడ్డల అపూరపూమైన పండుగ అని, పుడమి మెచ్చిన పూల పండుగ బతుకమ్మ, జీవ వైవిధ్యానానికి నిదర్శనం మన బతుకమ్మ పండుగ అని పేర్కొన్నారు. అనంతరం బతుకమ్మ పాటలతో విద్యార్థిలనుఆడిపాడారు. అనంతరంబతుకమ్మలో నీటిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సదానందంగౌడ్, మల్లేష్, వేణు, భీమేష్, బాలరాజు, రాజేష్, శ్రీనివాస్, మల్లిఖార్జున్, మహబూబ్‌అలీ, జుబేర్, లక్ష్మికాంత్‌సాగర్, లక్ష్మయ్య, నర్సింహమ్మలు, హైమద్‌తో పాటు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## గాయత్రీ దేవీ అలంకరణలో వాసవీమాత

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 05 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో నిర్వహిస్తున్న 54వ దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం వాసవీమాత గాయత్రిదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వందలాది భక్తులు నిత్య పూజ కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షులు బిల్లకంటి హరిబాబు ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ నేతృత్వంలో విశేష పూజ కార్యక్రమాలు సామూహిక కుంకుమార్చన డోలాత్సవం నిర్వహించారు. అనంతరం పాలాభిషేకం చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ కళ్యాణోత్సవం భక్తులను అలరించింది. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పట్టణ ఆర్య వైశ్యులు భక్తులు పాల్గొన్నారు.





## బాలాత్రిపుర సుందరిగా అమ్మవారు

జడ్చర్ల, అక్టోబర్ 5, ప్రభాతవార్త: నవరాత్రి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల వద్ద కోలాటాలు, బతుకమ్మలతో ఆడిపాడారు. జడ్చర్ల కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. పద్మావతీ కాలనీలో ఫేజ్ -1లో అమ్మవారు శ్రీ అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా సకల దేవతల ఆలయంలో గాయత్రి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళలు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కన్యకాపరమేశ్వరీ ఆలయంలో..



గాయత్రి దేవి అలంకరణలో ..



సకల దేవతల ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు